పర్యావరణ హితవుగా ఆక్వా సాగును పోల్చొద్దు

ప్రజాశక్తి - భీమవరం

పర్యావరణానికి హితవుగా ఉన్న వ్యవసాయ, ఉద్యానవన సాగుతో ఆక్వా సాగును పోల్చుకోవద్దని, నిబంధనలకు విరుద్ధంగా ఉంటే ఆక్వా సాగును కచ్చితంగా నిలుపుదల చేయాల్సిందేనని కలెక్టర్ పి.ప్రశాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో ఆమె మత్స్యశాఖ అధికారులతో సమీక్షించారు. ఆక్వా సాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు ఆలోచన చేయరాదని మత్స్య శాఖాధికారులకు హితవుపలికారు. వ్యవసాయ, ఉద్యాన పంటలు ద్వారా ప్రకృతికి మేలు చేకూరుతుందన్నారు. జిల్లాలో నిబంధనలు అతిక్రమించిన, ఇతర పంటలకు నష్టం చేకూర్చేలా ఉన్న ఆక్వా సాగును కచ్చితంగా నియంత్రించాల్సిందేనని ఆదేశించారు.ఫిష్ ఆంధ్రా యూనిట్ల ఏర్పాటు నత్తనడకన సాగుతుందని కలెక్టర్ ప్రశాంతి ఆగ్రహం వ్యక్తం చేశారు. మెప్మా ద్వారా గుర్తించిన యూనిట్ల లబ్ధిదారులకు బ్యాంక్ ఖాతాలను తెరించి మిగిలిన ప్రక్రియను గురువారం నాటికి పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఇన్‌ఛార్జి జెసి ఎం.సూర్యతేజ, డిఆర్‌డిఎ పీడీ ఎంఎస్ఎస్.వేణుగోపాల్ పాల్గొన్నారు.

మామిడికి తెగుళ్ల గండం..!

ఇప్పటికీ పూత, పిందె దశలోనే పంట

అనుకూలంగా లేని వాతావరణ పరిస్థితులు

నల్లతామర తెగుళ్ల దాడితో దెబ్బతింటున్న పూత

సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహనలో అధికారులు విఫలం

పెట్టుబడులైనా వస్తాయా అంటూ రైతుల్లో ఆందోళన

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

మామిడి రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. చివరి దశకు చేరుకోవాల్సిన పంట ఇప్పటికీ పూత, పిందె దశలోనే ఉండటంతో దిగుబడిపై రైతులు కంగారుపడుతున్నారు. రాత్రిపూట చలిగాలులు, పగటిపూట పెరిగిన ఉష్ణోగ్రతలతో మామిడి పంటకు వాతావరణం అనుకూలించడం లేదు. నల్లతామర వంటి తెగుళ్లు సోకి పూత దెబ్బతినడంతో మామిడి రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఏలూరు జిల్లాలో 50 వేల ఎకరాలకు పైగా మామిడి సాగవుతోంది. ఒక్క నూజివీడు నియోజకవర్గంలోనే దాదాపు 40 వేల ఎకరాల్లో మామిడి సాగు ఉంది. డిసెంబర్, జనవరి నెలల్లో పూత పూసి ఏప్రిల్ నాటికి మామిడి పంట చేతికి రావాల్సి ఉంటుంది. ఈ ఏడాది ఇప్పటికీ పూత, పిందె దశలో మామిడి పంట ఉంది. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో పూత నిలబడటం లేదని రైతులు గగ్గోలుపెడుతున్నారు. ఎకరం భూమిలో లేత మామిడి చెట్లు అయితే 45, ముదురు చెట్లు అయితే 25 వరకూ ఉంటాయి. ఇటీవల కాలంలో తెగుళ్ల బెడద పెరిగిపోవడంతో పురుగు మందులు పెద్దఎత్తున పిచికారీ చేయాల్సి వస్తోంది. దీంతో పెట్టుబడి తడిసిమోపెడవుతోంది. ఎకరానికి రూ.40 వేలు కౌలుకు, పెట్టుబడి ఖర్చులు కలిపి ఎకరాకు దాదాపు రూ.60 వేలకు పైగా అవుతున్నట్లు రైతులు చెబుతున్నారు. బాగా పండితే ఎకరం మామిడితోటలో 15 టన్నుల వరకూ దిగుబడి రావాలి. కానీ ఈ ఏడాది పూత దశలోనే తెగుళ్ల బెడద పెరిగిపోవడంతో దిగుబడిపై తీవ్రప్రభావం చూపనున్నట్లు తెలుస్తోంది. ఈ ఏడాది కనీసం పెట్టుబడులైనా వస్తాయా అంటూ రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

హార్టీకల్చర్ అధికారుల పర్యవేక్షణ కరువు

మామిడి పంటకు సంబంధించి హార్టీకల్చర్ అధికారుల పర్యవేక్షణ కొరవడినట్లు రైతులు చెబుతున్నారు. నూజివీడు పరిసర ప్రాంతాల్లో మామిడిసాగు పెద్దఎత్తున సాగవుతోంది. కానీ ఈ ప్రాంతంలో హార్టీకల్చర్ ఏడి హోదా అధికారి లేకుండాపోయారు. నూజివీడు మండలంలోని హార్టీకల్చర్ అధికారే ఇక్కడ నాలుగు మండలాలకు ఇన్‌ఛార్జిగా పనిచేస్తున్నట్లు చెబుతున్నారు. మామిడి పంటలకు తెగుళ్లు సోకితే ఏ పురుగుమందులు పిచికారి చేయాలన్న అవగాహన రైతులకు కల్పించేవారే లేకుండా పోయారు. దీంతో ఎరువుల విక్రయించే దుకాణదారులు చెప్పిందే వేదం అన్నట్లు సాగుతున్న పరిస్థితులు నెలకొన్నాయి. గడిచిన రెండు, మూడేళ్లుగా మామిడి రైతులు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు. సస్యరక్షణ చర్యలపై మామిడి రైతులకు అవగాహన కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నట్లు చర్చ నడుస్తోంది. ఇప్పటికైనా న్యూజివీడు ప్రాంతంలో హార్టికల్చర్ ఏడి అధికారిని నియమించి రైతులకు అవగాహన కల్పించడంలో చర్యలు తీసుకోవాలని రైతు సంఘాలు కోరుతున్నాయి. అంతేకాకుండా న్యూజివీడులో మామిడి మార్కెటింగ్ సదుపాయం ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు. మామిడి రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సి ఉంది.

ప్రతి మండలానికి హార్టికల్చర్ అధికారిని నియమించాలి

నిమ్మగడ్డ నరసింహులు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు

ఈఏడాది మామిడి పంట ఏమాత్రం ఆశాజనకంగా లేదు. తెగుళ్లబెడదతో పూత దశలోనే పంట దెబ్బతిన్న పరిస్థితి నెలకొంది. అత్యధికంగా మామిడి పండించే న్యూజివీడు ప్రాంతంలో ప్రతిమండలానికి హార్టికల్చర్ అధికారిని నియమించాలి. సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలి. ఏడి స్థాయి అధికారిని నియమించాలి.మార్కెంటింగ్ సెంటర్ ఏర్పాటు చేయడంతోపాటు, తెగుళ్లపై రైతులకు అవగాహన కల్పించేందుకు సీనియర్ సైంటిస్టులు నియమించాలి.

సంతృప్తికరంగా సమస్యల పరిష్కారం

కలెక్టర్ ప్రశాంతి ఆదేశం

ప్రజాశక్తి - భీమవరం

స్పందనలో అందిన ప్రతి దరఖాస్తునూ అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్లో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 179 అర్జీలను అధికారులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్పందనలో అందిన వినతుల పరిష్కారం అర్జీదారులకు ఆనందం కలిగించేలా ఉండాలన్నారు. అర్జీలు తిరిగి రీ ఓపెన్ అయ్యే అవకాశం లేకుండా శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. ఒకే సమస్యపై రెండోసారి స్పందనలో ఫిర్యాదు రాకుండా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. మండల స్థాయిలో అధికారులు సమస్యను పరిష్కరించినట్లయితే వారు జిల్లా కలెక్టర్ కార్యాలయానికి రావాల్సిన అవసరం ఉండదన్నారు. అధికారులు ఎప్పటికప్పుడు దరఖాస్తులను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ కె.కృష్ణవేణి, డిపిఒ ఎం.నాగలత, డిఎల్‌డిఒ కెసిహెచ్.అప్పారావు, భీమవరం డిఎస్‌పి బి.శ్రీనాథ్, అధికారులు పాల్గొన్నారు.



సమస్యలు వింటున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి

వెంలో నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

గ్యాస్ ధర తగ్గించాలని నిరసన

ప్రజాశక్తి - భీమవరం రూరల్

పెంచిన గ్యాస్ ధరను ఉపసంహరించుకోవాలని సిపిఎం మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. రూరల్ మండలంలోని వెంప గ్రామం కొత్తపేటలో సిపిఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అధిక ధరలను అరికడతానని చెప్పి మాట తప్పి 400 రూపాయలున్న గ్యాస్ ధరను రూ.1155లకు పెంచిందని విమర్శించారు. నిత్యావసర ధరలు పెరిగిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతుంటే మూలిగే నక్కపై తాటి పండు పడ్డట్టు గ్యాస్ ధర పెంచి మరింత భారం వేసిందన్నారు. సిపిఎం దీన్ని తీవ్రంగా ఖండిస్తోందన్నారు. తక్షణం పెంచిన గ్యాస్ ధరను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఈదా భూషణం, గుత్తుల భవాని, కండిబోయిన భాగ్యలక్ష్మి, జుత్తిగ మంగమ్మ, పి.భవాని పాల్గొన్నారు.

సాగునీటి కొరత లేకుండా చర్యలు చేపట్టాలి

అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

గోదావరిలో నీటిమట్టం తక్కువ ఉందని, ఈ నేపథ్యంలో పంట పొలాలకు సాగు నీటి కొరత లేకుండా చర్యలు చేపట్టాలని, అవసరమైతే వారాబంధీ నిర్వహించి నీటిని సక్రమంగా అందించాలని జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్లో సోమవారం జిల్లా, మండల స్థాయి అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించి మాట్లాడారు. పంట పొలాలకు నీటి సరఫరాలో ఎక్కడ ఇబ్బంది తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. వీటిపై ఏర్పాటు చేసిన కమిటీలు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. ఆక్వా రైతులు చేపల చెరువులకు అక్రమంగా నీటిని తరలిస్తే సంబంధిత బోర్లు, ఇంజిన్లను సీజ్ చేయడంతో పాటు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి హామీలో రోజూ ప్రతి మండలంలో వెయ్యి మంది కూలీలకు తగ్గకుండా పనులు కల్పించాలని సూచించారు. కాలువలు, చెరువుల్లో పూడికతీత పనులు చేపట్టాలని, తద్వారా ఎక్కువ మంది కూలీలకు పని కల్పించొచ్చని సూచించారు. ఈ సమావేశంలో డిఆర్ఒ కె.కృష్ణవేణి, డిపిఒ ఎం.నాగలత, డిఎల్‌డిఒ కెసిహెచ్ అప్పారావు, డిఎస్‌పి బి.శ్రీనాథ్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

రబీలో 3.770 క్యూసెక్కుల నీరు విడుదల

ఈ రబీ సీజన్లో జిల్లాకు 3,770 క్యూసెక్కుల నీటిని విడుదల చేయనున్నారని, ఈ నీటిని సద్వినియోగం చేసుకొని పంట పొలాలకు సక్రమంగా అందించాలని జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నీటిపారుదల, వ్యవసాయ, మత్స్యశాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో జిల్లా కలెక్టరు మాట్లాడారు. పంట పొలాలకు నీటి సరఫరాలో ఎక్కడా ఇబ్బంది తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. సాగునీటితో చేపలు, రొయ్యలు పెంచుతున్న ప్రాంతాల్లో అధికారులు ఎక్కువ దృష్టి పెట్టి మోటార్ల ద్వారా నీటి వినియోగం చేయకుండా కట్టడి చేయాలన్నారు. ఆక్వా రైతులు ఇంజిన్ల ద్వారా నీటిని తోడుతున్నట్లయితే వాటిని సీజ్ చేయాలని ఆదేశించారు. ఒక్క ఎకరాకూ నీటి సమస్య రాకుండా చూడాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఇన్‌ఛార్జి జాయింట్ కలెక్టర్ ఎం.సూర్యతేజ, జిల్లా నీటిపారుదల శాఖ అధికారి పి.నాగార్జునరావు, ఇఇలు, వ్యవసాయ శాఖ ఎఒలు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న కెవిపిఎస్ నాయకులు, గ్రామస్తులు

ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ ఇవ్వాలి

కెవిపిఎస్ ఆధ్వర్యాన కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి - భీమవరం

ఉండి మండలం చిలుకూరు గ్రామంలో ఎస్‌సి, బిసి కాలనీలో ప్రతి కుటుంబానికీ తక్షణం పంచాయతీ కుళాయి కనెక్షన్ ఇవ్వాలని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు డిమాండ్ చేశారు. భీమవరం జిల్లా కలెక్టరేట్ వద్ద కెవిపిఎస్ ఆధ్వర్యంలో చిలుకూరు గ్రామస్తులు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు కెవిపిఎస్ ఉండి మండల అధ్యక్షుడు కింతాడ రమేష్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా క్రాంతిబాబు విచ్చేసి మాట్లాడారు. చిలుకూరు గ్రామంలో ఎస్‌సి, బిసి కాలనీలో తాగునీటి సమస్య తీవ్రతరం అవుతోందన్నారు. ఇంటింటికీ కుళాయి కనెక్షన్ పేరుతో అధికారులు 2019లో కుటుంబానికి ఒక కనెక్షన్‌కు రూ.5,000 చొప్పున వసూలు చేశారని తెలిపారు. ఐదేళ్లు గడుస్తున్నా అధికారులు గానీ, ప్రజా ప్రతినిధులు గానీ సమాధానం చెప్పకపోవడం దారుణమన్నారు. దళితపేటలో సుమారు 300 కుటుంబాలకు, దాదాపు 800 మంది జనాభాకు కేవలం ఆరు మాత్రమే వీధి కుళాయిలు ఉన్నాయని చెప్పారు. దీనివల్ల నీటి కొరత అధికమవుతోందన్నారు. ఎన్నిసార్లు అధికారులకు విన్నవించుకుంటున్నా నిర్లక్ష్యపు సమాధానంతో కాలం గడుపుతున్నారని విమర్శించారు. ఎస్‌సి, బిసి కాలనీల పట్ల మండల అధికారుల చిన్న చూప విడనాడాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో సరిపడా వాటర్ ట్యాంకులు, పైపు కనెక్షన్లు ఉన్నా ఎందుకు చొరవచోపడం లేదని ప్రశ్నించారు. తాగునీటి సమస్యను పరిష్కరించకుండా రాజకీయ ఒత్తిడులతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తే ఊరుకోబోమన్నారు. తక్షణం ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు ఇచ్చే బాధ్యత జిల్లా అధికారులదే అన్నారు. జిల్లా అధికారులు స్పందించి ఇంటింటి కుళాయి కనెక్షన్లు ఇవ్వాలని క్రాంతిబాబు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం స్పందన కార్యక్రమంలో డిఆర్ఒ, డిపిఒకు కెవిపిఎస్ నాయకులు, చిలుకూరు ఎస్‌సి, బిసి కాలనీవాసులు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాజారావు, సుధీర్, ఆనంద్ బాబు, రాజేష్, శ్యాం, అశోక్, శ్రీను, సీత, డేజి, సుశీల పాల్గొన్నారు.

శివారు భూములకు సాగునీరందించాలని నిరసన

ప్రజాశక్తి - ఆచంట

రబీలో వరి చేలకు పూర్తిస్థాయిలో సాగునీరందించాలని ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఇందుకూరి సూర్యనారాయణ రాజు అన్నారు. సోమవారం రైతు సంఘం ఆధ్వర్యంలో కోడేరు, భీమలాపురం, కరుగోరుమిల్లి గ్రామాల్లో పంట పొలాలను పరిశీలించారు. అలాగే కోడేరు లాకులు వద్ద, భీమలాపురం పంట కాలువను పరిశీలించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కోడేరు బ్యాంకు కెనాల్ నుంచి నీరు అరకొరగా వస్తోందని, దీంతో పంట బోదెల్లో పూర్తిస్థాయిలో నీరు ఉండడం లేదని తెలిపారు. రోజురోజుకూ సాగునీటి ఎద్దడి పెరుగుతోందని, వరిచేలకు సాగునీరందక పొలాలు బీటలు వారుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికే లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టిన రైతన్నలు పంట చేతికందుతుందో లేదో అని అయోమయంలో కొట్టు మిట్టాడుతున్నారని వాపోయారు. పగలనకా రాత్రనకా కంటిమీద కునుకు లేకుండా పంట పొలాల చుట్టూ తిరుగుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణం అధికారులు స్పందించి శివారు ప్రాంతాలకు పూర్తిస్థాయిలో సాగునీరందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు డి.పెద్ద సత్యనారాయణ, కె.నాగేశ్వరరావు, గుడాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కోడేరు లాకుల వద్ద నిరసన తెలుపుతున్న రైతు సంఘం నాయకులు

విశ్వసనీయతకు నిదర్శనం జగన్

ఎంఎల్‌సి అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలి

మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

రాజకీయాల్లో విశ్వసనీయతకు నిలువెత్తు నిదర్శనం ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. స్థానిక టౌన్ హాల్లో సోమవారం సాయంత్రం ఎంపిటిసి, జెడ్‌పిటిసిలతో ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మంత్రి కారుమూరి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ముఖ్యమంత్రి ఎంపిక చేసిన అభ్యర్థులు కవురు శ్రీనివాస్, వంకా రవీంద్రనాథ్ ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలుపొందడం ఖాయమన్నారు. రాజకీయాల్లో విశ్వసనీయత చాలా ముఖ్యమని, అది టిడిపికి లేదన్నారు. టిడిపి చేసే మాయలో ఎవరూ పడొద్దని తెలిపారు. ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ ఎంఎల్‌సి అభ్యర్థుల గెలుపునకు ఎంపిటిసిలు, జెడ్‌పిటిసిలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఎంఎల్‌సి అభ్యర్థులు కవురు శ్రీనివాస్, వంకా రవీంద్రనాథ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ విజయానికి అండగా నిలబడాలని కోరారు. తమకు అవకాశం కల్పించిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామన్నారు. ఈ సమావేశంలో ఎఎంసి ఛైర్మన్ కోటిపల్లి బాబు, భీమవరం ఎంపిపి పేరిచర్ల విజయ నరసింహరాజు, జెడ్‌పిటిసి కాండ్రేగుల నరసింహారావు, పాలకొల్లు జెడ్‌పిటిసి నడపన సూర్యనారాయణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇవ్వాలి

సిపిఎం ఆధ్వర్యాన పేదలు, లబ్ధిదారుల ధర్నాలు

ప్రజాశక్తి - వీరవాసరం

ఆర్థిక స్తోమత లేని లబ్ధిదారులకు జగనన్న కాలనీల్లో ప్రభుత్వమే ఉచితంగా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సిపిఎం డిమాండ్ చేసింది. సోమవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద లబ్ధిదారులతో ధర్నా నిర్వహించి అనంతరం తహశీల్దార్ సుందరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు జుత్తిగ నరసింహమూర్తి మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో తక్షణం మౌలిక వసతులు కల్పించాలన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం ఇస్తున్న రూ.1.80 లక్షలను రూ.ఆరు లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఇల్లు నిర్మించుకోకపోతే పట్టాలు రద్దు చేస్తామంటూ అధికారులు హెచ్చరించడం సరికాదన్నారు. కాలనీల్లో సమస్యలను పరిష్కరించాలన్నారు. ఒక పక్క పెరిగిన నిత్యావసర ధరలతో లబ్ధిదారులు ఆర్థిక ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వం ఇస్తున్న అరకొర లబ్ధితో ఇళ్లు ఎలా నిర్మించుకోగలరని ఆయన ప్రశ్నించారు. ఇటీవల సిపిఎం బృందం మత్స్యపురిపాలెం, మత్స్యపురి, తలతాడితిప్ప, మడుగుపోలవరం, ఉత్తరపాలెం గ్రామాల్లో పర్యటించి జగనన్న కాలనీలను పరిశీలించినట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లో సుమారు 400 మంది లబ్ధిదారులుంటే 291 మంది ఇంటి పనులు ప్రారంభించలేని స్థితిలో ఉన్నారన్నారు. 80 మంది బేస్‌మెంట్లు వేసుకుంటే 30 మంది మాత్రమే ఇళ్లను పూర్తిగా నిర్మించుకున్నారని తెలిపారు. తక్షణం ప్రభుత్వం స్పందించి లబ్ధిదారులకు ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కన్వీనర్ పోతుల మృత్యుంజయ, రెడ్డి రామారావు, కేతా జ్యోతిబసు, బొబ్బనపల్లి సూర్యచంద్రరావు, యాళ్లబండి నారాయణమూర్తి, పాలా కోటేశ్వరరావు, కర్రా నరసింహమూర్తి పాల్గొన్నారు.

వీరవాసరం : తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నేతలు

తణుకురూరల్: కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నేతలు

తణుకురూరల్ : జగనన్న గృహ లబ్ధిదారులకు ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సిపిఎం పట్టణ కార్యదర్శి పివి ప్రతాప్ డిమాండ్ చేశారు. సోమవారం మున్సిపల్ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి, అనంతరం కమిషనర్ సుధాకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో నేటికి వెయ్యి కూడా ఇళ్ల నిర్మాణం పూర్తి కాలేదని, దీనికి ప్రభుత్వ వైఖరే కారణమన్నారు. గ్రామానికి, పట్టణానికి ఒకే విధంగా ఇంటి నిర్మాణం కోసం రూ.1.80 వేలు ఇచ్చారని ఈ డబ్బులు బేస్‌మెంట్ వేయడానికి కూడా చాలడం లేదని విమర్శించారు. సిపిఎం ప్రతి ఇంటికీ రూ.6 లక్షలు ఇవ్వాలని కోరుతోందన్నారు. డిసెంబర్ నాటికి ఇల్లు కట్టకుంటే పట్టాలు తీసుకుంటామని బెదిరించడం సిగ్గుచేటన్నారు. లబ్ధిదారుల సమస్యలపై అధికారులు స్పందించకుంటే ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

పార్టీలకతీతంగా మద్దతివ్వండి

ఎంఎల్‌సి అభ్యర్థి వీరవల్లి చంద్రశేఖర్

ప్రజాశక్తి - మొగల్తూరు

ఎంఎల్‌సి ఎన్నికల్లో పోటీ చేస్తున్న తనకు పార్టీలకు అతీతంగా మద్దతివ్వాలని ఎంఎల్‌సి అభ్యర్థి వీరవల్లి చంద్రశేఖర్ కోరారు. సోమవారం ఆయన మొగల్తూరులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి మండల అధ్యక్షుడు గుబ్బల నాగరాజు అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రం ఇచ్చిన నిధులను కూడా స్థానిక సంస్థల్లో వెచ్చించకుండా రాష్ట్ర ప్రభుత్వం అడ్డుపడుతోందన్నారు. ఎంపిటిసి, ఎంపిపిలు తదితరులకు గౌరవ వేతనాలు పెంచేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ప్రభుత్వం స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులను ఉత్సవ విగ్రహాలుగా మార్చిందని విమర్శించారు. పంచాయతీ రాజ్ ఛాంబర్ అండతో ఎన్నికల బరిలో నిలుచున్నానని తెలిపారు. ఇటీవల కాపు సంక్షేమ సేన వ్యవస్థాపక అధ్యక్షులు చేగొండి హరి రామ జోగయ్యను కలిశానని తెలిపారు. కాపు సంక్షేమ శాఖ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారని తెలిపారు. మొదటి ప్రాధాన్యతా ఓటు తనకు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శెట్టిబలిజ రాష్ట్ర సాధికార కమిటీ డైరెక్టర్ బొక్క సూరిబాబు, భీమవరం సిహెచ్‌సి మాజీ ఛైర్మన్ మామిడిశెట్టి ప్రసాద్, మాజీ వైస్ ఎంపిపి కత్తి ముత్యాలరావు, పాలా రాంబాబు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎంఎల్‌సి అభ్యర్థి చంద్రశేఖర్


బ్రోచర్ ఆవిష్కరిస్తున్న కళాశాల ప్రిన్సిపల్ జగపతి రాజు

8న ఎస్ఆర్‌కెఆర్‌లో మహిళా దినోత్సవం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఈ నెల 8వ తేదీ భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో మహిళా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ఎం.జగపతిరాజు చెప్పారు. సోమవారం కళాశాలలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో జగపతి రాజు మహిళా దినోత్సవం బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కళాశాల ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ బిహెచ్‌పిఎన్.లక్ష్మి, కెఎం.గణేష్ మాట్లాడుతూ మహిళా దినోత్సవానికి ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, కళాశాల పూర్వ విద్యార్థిని, రెనే.కో సిఇఒ ఇందుకూరు మోహన్ వంశీ పాల్గొనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ ఫాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ సిహెచ్ సత్యనారాయణ మూర్తి, పిఎంజెఎఫ్ లయన్ సిహెచ్ కృష్ణంరాజు, లయన్స్ క్లబ్ ఆఫ్ భీమవరం అధ్యక్షులు నందమూరి రాజేష్‌తో పాటు లయన్స్ క్లబ్ ప్రతినిధులు భాగస్వాములవుతున్నారని తెలిపారు.

వృద్ధులకు కంటి పరీక్షలు

ప్రజాశక్తి - పెనుమంట్ర

వృద్ధులు కంటి చూపు దెబ్బతినకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పెనుమంట్ర సిహెచ్‌సి డాక్టర్ వై.అనూష, కె.లావణ్య అన్నారు. పెనుమంట్ర సచివాలయం-2 బ్రాహ్మణచెరువులో మూడు రోజులపాటు నిర్వహించే వైఎస్ఆర్ అవ్వ, తాత కంటి పరీక్షలు సోమవారం మొదటిరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుమారు 174 మందికి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కళ్లజోళ్లు అందజేస్తామని, అవసరమైన వారికి ఆపరేషన్ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ కె.కృష్ణ, సచివాలయం ఎఎన్ఎం ఎస్.లక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పిలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రిని కలిసిన కిషోర్ కుమార్

ప్రజాశక్తి - ఆచంట


జగన్‌కు జ్ఞాపికను అందిస్తున్న కిషోర్‌కుమార్

ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు కుమార్తె వివాహానికి హాజరైన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని వైసిపి రాష్ట్ర కార్యదర్శి వైట్ల కిషోర్ కుమార్ ఆదివారం సాయంత్రం మర్యాదపూర్వంగా కలిసి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా జగన్మోహన్‌రెడ్డి వైసిపికి తాను అందిస్తున్న సేవలపై అభినందించి పార్టీ బలోపేతానికి మరింత కృషి చేయాలని కోరినట్లు కిషోర్ తెలిపారు. ఆయన వెంట వైసిపి నాయకులు అరిగెల సురేష్ బాబు అన్నారు.

అదాని పెట్టుబడులపై కాంగ్రెస్ నిరసన

ప్రజాశక్తి - కాళ్ల

ఎస్‌బిఐ వద్ద నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

ఎల్ఐసి తదితర ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా అదాని కంపెనీల్లో బలవంతపు పెట్టుబడులు పెట్టడాన్ని కాంగ్రెస్ వ్యతిరేకిస్తోందని కాంగ్రెస్ ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వేగేశ్న వెంకట గోపాలకృష్ణంరాజు అన్నారు. సోమవారం జువ్వలపాలెంలో ఎస్‌బిఐ వద్ద కాంగ్రెస్ నేతలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం ప్రజా వ్యతిరేక విధానాలను విరమించుకోకపోతే ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా జనరల్ సెక్రటరీ బొర్రా పార్థు, మండల అధ్యక్షులు కొల్లి సత్యశ్రీనివాస్ పాల్గొన్నారు.

వృద్ధురాలి మెడలో బంగారపు గొలుసు అపహరణ

ఘటనా స్థలిని పరిశీలించిన ఎస్‌పి రవిప్రకాష్

ప్రజాశక్తి - కాళ్ల

ప్రాతళ్లమెరక గ్రామంలో వద్ధురాలి మెడలో ఆరు కాసుల బంగారు తాడు అపహరించుకుపోయిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ప్రాతళ్లమెరకకు చెందిన అల్లూరి పద్మావతి(72) తన ఇంట్లో ఒంటరిగా జీవిస్తోంది. ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో గుర్తు తెలియని వ్యక్తి అటుగా వెళ్తూ ఆమె మెడలోని ఆరుకాసుల బంగారపు తాడు అపహరించుకుని పరారయ్యాడు. ఈ ఘటనపై బాధితురాలి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సంఘటనా స్థలిని జిల్లా ఎస్‌పి రవిప్రకాష్ సోమవారం సాయంత్రం పరిశీలించారు బాధితురాలి నుంచి వివరాలు సేకరించారు. కేసు దర్యాప్తు చేసినట్లు ఎస్ఐ మూర్తి తెలిపారు.

ఇసుక తవ్వకాల నిలుపుదలకు హైకోర్టు స్టే

ప్రజాశక్తి - యలమంచిలి

మండలంలోని ఏనుగువానిలంక పరిధిలో ఉన్న చించినాడలంక భూముల పరిధిలోని ఎస్‌సి, బిసి గోదావరి డిఫారం పట్టా లంక భూముల డెవలప్‌మెంట్ సొసైటీకి సంబంధించిన లంకల్లో ఇసుక తవ్వకాలను వెంటనే నిలుపుదల చేయాలని హైకోర్టు ఈ నెల మూడో తేదీన స్టే విధించినట్లు సొసైటీ ప్రెసిడెంట్ గొల్ల ఏడుకొండల శ్రీనివాస్, కార్యదర్శి కేత రాము సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఏడుకొండలు మాట్లాడుతూ ఎస్‌సి, బిసిలకు సంబంధించిన లంక భూముల్లో ప్రభుత్వం పేరుతో ఇటీవల గోదావరికి ఆనుకుని వందలాది లారీలతో ఇసుకను ప్రయివేట్ వ్యక్తులు సైతం ఇసుక మాఫీయగా తయారై తరలించిన నేపథ్యంలో సొసైటీ తరపున గత నెల 16వ తేదీన హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసినట్లు తెలిపారు. దీనిపై విచారించిన హైకోర్టు ఇసుక తవ్వకాల నిలుపుదలకు స్టే విధించినట్లు తెలిపారు.

నేరాలు - ఘోరాలు

చోరీ కేసులో నిందితుడు అరెస్టు

రూ.1.20 లక్షల చోరీ సొత్తు స్వాధీనం

ప్రజాశక్తి - పెనుమంట్ర

వివరాలు తెలుపుతున్న పోలీసులు

చోరీలకు పాల్పడుతున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు డిఎస్‌పి కె.రవిమోహనాచారి తెలిపారు. సోమవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో డిఎస్‌పి వివరాలు వెల్లడించారు. తణుకు టౌన్‌కు చెందిన వరద కుమార్ ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లో పాత ఇనుము, చిల్లర దొంగతనాలు చేసేవాడు. ఇతనిపై తణుకు టౌన్, అత్తిలి పోలీస్‌స్టేషన్‌లో కేసులు ఉన్నాయి. ఈ క్రమంలో గతేడాది డిసెంబర్ 20వ తేదీ తెల్లవారుజామున 4.30 సమయంలో మార్టేరు వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న ఆఫీసు రూమ్ తాళం పగలగొట్టి బీరువాలో ఉన్న రూ1.50 లక్షలు, అక్కడ ఉన్న రశీదులు అపహరించుకుపోయాడు. కుమార్‌ను సోమవారం మార్టేరు కొత్త వంతెన వద్ద పోలీసులు అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి రూ.1.20 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. విలేకర్ల సమావేశంలో పెనుగొండ సిఐ జివివి.నాగేశ్వరరావు, ఎస్ఐ బి.సురేంద్రకుమార్ ఉన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

తాగు, సాగు నీటిపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి - కాళ్ల

మాట్లాడుతున్న ఎంపిపి పెన్మెత్స శిరీష

తాగు, సాగునీరందించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమిష్టి కృషి చేయాల్సి ఉందని ఎంపిపి పెన్మెత్స శిరీష అన్నారు. కాళ్ల మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపిపి పెన్మెత్స శిరీష అధ్యక్షత వహించారు. అనంతరం శాఖలవారీగా సమీక్షించారు. ఈ సమావేశానికి పరిశీలకులుగా తహశీల్దార్ టిఎ కృష్ణారావు వ్యవహరించారు. అనంతరం ఎంపిడిఒ స్వాతి మాట్లాడుతూ మండల పరిషత్ సమావేశం 90 రోజుల్లోగా నిర్వహించాలని నిబంధన ఉండడంతో కలెక్టర్ అనుమతి తీసుకొని ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఏజెండా లేకుండా శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. సమావేశం జరుగుతున్న తీరును వీడియో రికార్డ్ చేసి ఉన్నతాధికారులకు నివేదించనున్నారు. ఎంఇఒ రవీంద్ర మాట్లాడుతూ ఏప్రిల్ 3వ తేదీ నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభమవుతాయన్నారు. మండలంలో కాళ్ల, కోపల్లె, ఏలూరుపాడు, కలవపూడి పరీక్షా కేంద్రాల్లో 828 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నారని, అన్ని ఏర్పాట్లూ చేశామని తెలిపారు. ఇఒఆర్‌డి ఎంవి.భాస్కర్‌రావు మాట్లాడుతూ మండలంలో 88 శాతం ఇంటి పన్నులు వసూలు చేయడం జరిగిందన్నారు. ఈ నెల 10వ తేదీలోగా నూరు శాతం లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. విద్యుత్ శాఖ అధికారి పి.రాంబాబు మాట్లాడుతూ ఐదు విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో లోవోల్టేజ్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. మండలంలో ఆక్వా విద్యుత్తు కనెక్షన్లు 2300 ఉన్నాయన్నారు. 1256 విద్యుత్తు కనెక్షన్లకు ఆక్వా సబ్సిడీ వర్తించిందన్నారు. ఈ సమావేశంలో మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు సరాబు పద్మారాణి, మన్నే నాగలక్ష్మి, మండల కోఆప్షన్ సభ్యుడు గుర్రం జార్జి బెనహర్, పెన్మెత్స విశ్వనాధరాజు పాల్గొన్నారు.

సత్యనారాయణ ఆశయ సాధనకు కృషి చేయాలి

సిపిఎం మండల కార్యదర్శి అశ్రియ్య

ప్రజాశక్తి - పాలకోడేరు

సత్యనారాయణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజా పోరాటాల్లో అలుపెరుగని సేవలందించిన చేబోలు సత్యనారాయణ ఆశయ సాధనకు కృషి చేయాలని సిపిఎం మండల కార్యదర్శి శేషాపు అశ్రియ్య పిలుపునిచ్చారు. చేబోలు సత్యనారాయణ మూడో వర్ధంతిని శృంగవృక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అశ్రియ్య మాట్లాడుతూ సత్యనారాయణ పాలకోడేరు, ఉండి మండలాల్లో ఎన్నో భూ పోరాటాలు చేశారన్నారు. పేదల పక్షాన నిలిచి వారి సమస్యలపై అలుపెరుగని పోరాటాలు చేశారన్నారు. భీమవరం, పాలకోడేరు, ఉండి, వీరవాసరం, కాళ్ల ప్రాంతాల్లో జరిగిన అనేక ప్రజా ఉద్యమాల్లో కీలకపాత్ర పోషించారన్నారు. ముఖ్యంగా ఇళ్ల స్థలాలు, కూలి పోరాటాలు, దళితులపై కుల వివక్ష అసమానతలపై అవిరామంగా కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు లక్ష్మి, సుబ్బారావు, భోగమ్మ, సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

మహిళా చట్టాల అమల్లో విఫలం

ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ

మాట్లాడుతున్న ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

మహిళా చట్టాల అమల్లో ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ విమర్శించారు. నవాబుపాలెంలో సోమవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఐద్వా ఆధ్వర్యంలో సోమవారం అంబేద్కర్ కమ్యూనిటీ హాల్లో ఐద్వా మండల కార్యదర్శి పి.సత్యవతి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి పొగాకు పూర్ణ, జిల్లా కమిటీ సభ్యులు యశోద హాజరయ్యారు. ముందుగా అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూర్ణ, గ్రామ సర్పంచి మద్దుకూరి గంగాభవాని పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో పూర్ణ మాట్లాడుతూ ప్రభుత్వాలు మహిళల రక్షణ కోసం ఎన్ని చట్టాలు తీసుకొచ్చినా వాటిని ప్రకడ్బందీగా అమలు చేయడంలో విఫలమయ్యాయని తెలిపారు. పసిపిల్లల మొదలుకొని వృద్ధుల వరకూ అత్యాచారాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అరాచకాల నుంచి కాపాడుకోవడం కోసం మహిళలు ఉద్యమించి, హక్కులకై పోరాడాలన్నారు. జిల్లా నాయకురాలు యశోద మాట్లాడుతూ ఐద్వా మహిళలకు అండగా నిలుస్తోందన్నారు. అనంతరం గ్రామ సర్పంచి మద్దుకూరి గంగాభవానిని ఐద్వా నాయకులు సత్కరించారు. అలాగే బెల్టు షాపు, అక్రమ మద్యం షాపులకు వ్యతిరేకంగా పోరాడి బెల్ట్ షాపుల్లో ఉన్న మద్యాన్ని సీసాలను పగలగొట్టి, మహిళా సంఘం ఆధ్వర్యంలో పోరాటాలు నడిపిన సీనియర్ నాయకురాలు పాలుపూరు వెంకాయమ్మను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా సీనియర్ నాయకురాలు కండెల్లి విజయ, జిల్లా కమిటీ సభ్యురాలు కండెల్లి కమల కుమారి, ఎంపిటిసి బండి వెంకటలక్ష్మి, వార్డు సభ్యులు దార్లంక నాగమణి, పెదగాడి వెంకటలక్ష్మి, ఆశా వర్కర్స్ యూనియన్ మండల నాయకురాలు అనంతలక్ష్మి, మిడ్ డే మిల్స్ నాయకురాలు కసే నాగమణి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కండెల్లి సోమరాజు, జిల్లా కమిటీ సభ్యులు కండెల్లి రమేష్ బాబు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డుతో ఇబ్బందులు

స్పందనలో కలెక్టర్‌కు ఉండి వాసి ఫిర్యాదు

ప్రజాశక్తి - ఉండి

రోడ్డు పక్కనే వేసిన చెత్త

ఉండి నుండి ఉప్పుగుంట వెళ్లే మార్గంలో శ్మశానవాటికను ఆనుకొని ఉన్న డంపింగ్ యార్డు వల్ల పక్కనే ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, పిహెచ్‌సి సిబ్బంది, రోగులు ఇబ్బందులు పడుతున్నారని ఉండి గ్రామానికి చెందిన రాయి సతీష్ సోమవారం స్పందనలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం విలేకరులకు వివరాలు తెలిపారు. ఈ శ్మశానవాటిక సుమారు 10 ఎకరాల గ్రామకంతం భూమిలో ఉందని, ఆ భూమిని ఆనుకుని ఉన్న డంపింగ్ యార్డు నుంచి వచ్చే దుర్వాసన వల్ల ఉప్పుగుంట వెళ్లే ప్రజలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, రోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉండి గ్రామ పంచాయతీ సేకరించిన చెత్తను రోడ్డుకిరువైపులా పోయడమే కాకుండా శ్మశానవాటిక మొత్తం ఆక్రమించారని తెలిపారు. దీంతో మృతదేహాలకు దహన సంస్కారం చేయడానికి గాని, పూడ్చడానికి గాని మృతుల బంధువులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉండి గ్రామ పంచాయతీ అధికారులకు, రెవెన్యూ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదన్నారు. ఏప్రిల్‌లో ఈస్టర్ పండుగను పురస్కరించుకుని శ్మశానవాటికను బాగు చేయించాలని, ఉన్నతాధికారులతో సర్వే చేయించి శ్మశానవాటిక భూమి అన్యాక్రాంతం కాకుండా చూడాలని స్పందనలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

'డిఎన్ఆర్'లో తెలుగు జర్నలిజంపై సర్టిఫికెట్ కోర్సు

ప్రజాశక్తి - పాలకొల్లు



మాట్లాడుతున్న డాక్టర్ సుబ్బారావు

పాలకొల్లు డిఎన్ఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గాంధీయన్ ఫిలాసఫీ తెలుగు జర్నలిజంపై మూడు నెలల సర్టిఫికెట్ కోర్సు సోమవారం ప్రారంభించారు. ముఖ్య అతిథిగా నరసాపురం వైఎన్ కళాశాల, గాంధీయన్ ఫిలాసఫీ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ పి.సుబ్బారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ స్థాయి నాయకులైన మార్టిన్ లూథర్, ఐన్‌స్టిన్, నెల్సన్ మండేలా, ఒబామా వంటి ప్రముఖులు గాంధీ సిద్ధాంతాల ద్వారా ప్రభావితులయ్యారని చెప్పారు. నేటి ప్రపంచమంతా గాంధీ సిద్ధాంతాలు వైపు మొగ్గు చూపుతుందన్నారు. గాంధీజీ బహుముఖ ప్రజ్ఞాశాలి అని, భవిష్య దర్శకుడని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శోభారాణి మాట్లాడుతూ విద్యార్థులు ఈ కోర్స్ చేయటం ద్వారా మానసిక ఒత్తిడిని జయించి ప్రశాంత వాతావరణంలో విద్యాభ్యాసాన్ని కొనసాగించవచ్చున్నారు. గాంధీయిజం ద్వారా శాంతి సామరస్యతను పెంపొందించుకోవచ్చని చెప్పారు. పొలిటిక్స్ లెక్చరర్ జ్యోత్స్న మాట్లాడుతూ విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని డిగ్రీతో పాటు అదనపు సర్టిఫికెట్ కోర్సులను కూడా అభ్యసించాలన్నారు. ఈ కార్యక్రమంలో నోబుల్ రాజ్, శిరీష్, జ్యోత్స్న పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీల సమస్యలు పరిష్కరించాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల చినవీరభద్రరావు

ప్రజాశక్తి - తణుకు రూరల్

కూలీల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న చినవీరభద్రరావు

వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పుల వల్ల గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు పని దినాలు తగ్గిపోతున్నాయని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల చినవీరభద్రరావు ఆవేదన వ్యక్తం చేశారు. తణుకు మండలంలోని దువ్వ గ్రామంలో పనిచేస్తున్న ఉపాధి కూలీలను ఆయన సోమవారం కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కూలీలు గత రెండు సంవత్సరాల క్రితం చేసిన పనులకు డబ్బులు నేటికీ రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా అయితే ఏమి తినాలని బతకాలని వాపోయారు. తమకు పనిముట్లు కూడా ఇవ్వడం లేదని పనులు చేస్తున్న కూలీలు చినవీభ్రద్రరావు వద్ద వాపోయారు. అనంతరం వీరభద్రరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయ కార్మికులతో పాటు పేద, మధ్య తరగతి ప్రజలకు ఉపాధి హామీ పెద్ద ఆసరాగా ఉందని తెలిపారు. చేసిన పనికి 15 రోజుల్లో వేతనాలు చెల్లించాలని చట్టంలో ఉన్నప్పటికీ ఆచరణలో చెల్లించకపోవడం దుర్మార్గమని ఆయన విమర్శించారు. కూలీలు చేసిన పనులకు పే స్లిప్‌లు ఇవ్వాలని, కూలీ బకాయిలు వెంటనే ఇవ్వాలని, సైట్ సూపర్‌వైజర్లుకు స్మార్ట్ ఫోన్‌లు ఇవ్వాలని, క్షేత్రస్థాయి సిబ్బందిపై రాజకీయ జోక్యం నివారించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దొంగల నాగేశ్వరరావు, బండారు వెంకటేశ్వరరావు, మద్దూరి సూర్యనారాయణ, గుబ్బల పద్మ, మట్టా వీరవేణి, కాసాని లక్ష్మి, జి.సూర్యనారాయణ, శనగన మాణిక్యం, ఆలం ధనరాజు పాల్గొన్నారు.

శశిలో 17, 18 తేదీల్లో

అన్వేషణ-2023 జాతీయ స్థాయి టెక్నో కల్చరల్ ఫెస్ట్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

శశి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ ఇంజినీరింగ్ కాలేజీలో ఈ నెల 17, 18 తేదీల్లో జరుగనున్న అన్వేషణ - 2023 జాతీయ స్థాయి టెక్నో కల్చరల్ ఫెస్ట్ వెబ్‌యాప్‌ను భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాల విద్యార్థుల ప్రతిభను వెలికి తీయడానికి శశి యాజమాన్యం చేస్తున్న కృషిని కొనియాడారు. యువత ఇలాంటి సాంకేతిక, సాంస్కృతిక ఫెస్ట్‌లలో పాల్గొని తమ నైపుణ్యాన్ని ప్రదర్శించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న శశి ఇంజినీరింగ్ కళాశాల ఛైర్మన్ బూరుగుపల్లి వేణు గోపాల కృష్ణ, వైస్ ఛైర్మన్ మేకా నరేంద్ర కృష్ణకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మొహమ్మద్ ఇస్మాయిల్, అన్వేషణ కో-ఆర్డినేటర్ డాక్టర్ టి.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

భట్లమగుటూరులో రామస్వామి వర్ధంతి సభ

ప్రజాశక్తి - పెనుమంట్ర

బట్లమగుటూరుకు చెందిన సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి, కీర్తిశేషులు జస్టిస్ డాక్టర్ కటికితల రామస్వామి నాలుగో వర్ధంతిని సోమవారం బట్లమగుటూరు గ్రామంలో ఘనంగా నిర్వహించారు. రామస్వామి చిన్న అల్లుడు కె.శ్రీనివాసరాజు, మనుమడు వీర్రాజు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని రామస్వామి దంపతుల విగ్రహాల వద్ద నివాళులర్పించారు. అనంతరం స్థానిక మండల పరిషత్ పాఠశాలలో రామస్వామి చిత్రపటం వద్ద నివాళులర్పించి, విద్యార్థులకు అంబేద్కర్ పుస్తకాలు, స్వీట్లు పంపిణీ చేశారు. రామస్వామి, అంబేద్కర్ విశిష్టతను విద్యార్థులకు తెలిపారు.

విద్యాభివృద్ధికే సెల్‌ఫోన్లు వాడాలి

ప్రజాశక్తి - పాలకొల్లు

మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా మాంటిస్సోరీ స్కూల్లో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో పాలకొల్లు స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ డి.మంగతాయారు పాల్గొన్నారు. విద్యార్థులు విద్యాభివృద్ధికి మాత్రమే సెల్‌ఫోన్లు ఉపయోగించాలని ఆమె కోరారు. ఒక వ్యక్తి జననం నుండి మరణం వరకూ పలు హక్కులను చట్టాలను రూపొందించారని, వాటికి లోబడి జీవించాలని తెలిపారు. విద్యార్థులు బాగా చదివి మంచి అవకాశాలను అందిపుచ్చుకోవాలని కోరారు. అందరికీ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ వసంత లక్ష్మి పాల్గొన్నారు.

ప్రజా సేవే లక్ష్యం

కనకరత్నమాల

ప్రజాశక్తి - ఆచంట

ప్రజలకు సేవ చేయడమే తన లక్ష్యమని శ్రీదేవి ఆర్యవైశ్య సేవ మండలి భీమలాపురం వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు కొత్త కనకరత్నమాల అన్నారు. మండలంలోని భీమలాపురం గ్రామానికి కొత్త కనకరత్నమాల ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగంలో అడిషనల్ ట్రెజరరీగా నియమితులయ్యారు. ఈ మేరకు తనకు శ్రీశైలంలో రాష్ట్ర అధ్యక్షురాలు నాళ్లం అండాలు నియామక అందించినట్లు కనకరత్నమాల సోమవారం తెలిపారు. భీమలాపురం గ్రామ అభివృద్ధికి చేసిన కృషికి, స్త్రీ శిశు సంక్షేమ అభివృద్ధికి చేసిన సేవలకు తనను అడిషనల్ ట్రెజరరీగా ఎంపిక చేసినట్లు ఆమె తెలిపారు. తాను గ్రామస్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి వరకు వంద అవార్డులు తీసుకున్నట్లు వివరించారు. ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా ప్రభుత్వ పథకాలను ప్రజలకు తెలియజేస్తూ చైతన్యవంతం చేస్తున్నామని తెలిపారు.

బొండాడలో అన్నసమారాధన

ప్రజాశక్తి - కాళ్ల

బొండాడ గ్రామంలో పోలేరమ్మ, మహాలక్ష్మమ్మ అమ్మవార్ల జాతర మహోత్సవాల సందర్భంగా సోమవారం అన్న సమరాధన నిర్వహించారు. దేవస్థాన ఛైర్మన్ పెనుమత్స రంగరాజు నాగలక్ష్మి దంపతులతో మహాచండి హోమం నిర్వహించారు. డిసిసిబి ఛైర్మన్, వైసిపి ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహరాజు, గాదిరాజు సుబ్బరాజు, కొలుకులూరి ధర్మరాజు అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇఒ వేగేశ్న ఆంజనేయరాజు, బొండాడపేట సర్పంచి గోళ్ల వెంకట సత్యనారాయణ, మన్నే నాగరాజు, కందుల హనుమా, మన్నే శ్రీను పాల్గొన్నారు.

మహారాజశ్రీ తాడేపల్లి గూడెం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A. No. 636 of 2022 in I.A. No. 455 of 2020
in O.S. No. 583 of 2000
Between :
కొనారపు నాగమ్మ (డైడ్) వగైరా .... పిటీషనర్లు
మరియు
ఈసరపు సన్యాసమ్మ వగైరా ..... రెస్పాండెంట్లు
పై నెంబరు గల పిటీషనులో R14 అయిన పెనింటి నూకరాజు, తండ్రి :రమణ అనే పేరున శ్రీ కోర్టు వారి ఆర్డర్ ప్రకారం ఎన్ని పర్యాయములు బత్తా కట్టినప్పటికి అతను ఉద్దేశ్యపూర్వకంగా శ్రీ కోర్టువారి సమన్లు తీసుకోనందున శ్రీ కోర్టు వారు ఈ పేపరు ప్రకటన ద్వారా R14 కు తెలియపర్చమని ది.24.02.2023వ తేదీ గల ఆర్డరు ద్వారా మీకు తెలియపర్చడమైనది. సదరు విషయం గురించి మీకు ఎటువంటి అభ్యంతరములు ఉన్న ది.27.03.2023వ తేది ఉదయం 10.30 గంటలకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా హాజరు అయి తెలుపుకోవలెను. లేనియెడల శ్రీ కోర్టువారు తదుపరి విచారణను కొనసాగించెదురు అని తెలియపర్చడమైనది.
స్థలం : తాడేపల్లిగూడెం తేది : 06.03.2023
ఇట్లు
కె. సూర్యచంద్రరావు, పిటీషనర్లు తరుపున న్యాయవాది
తాడేపల్లిగూడెం - 534101, సెల్ : 9581919670

PUBLIC NOTICE
This Public Notice is given on the instructions of my client **TAMMU AMMAJI,** W/o. Tammu Venkateswara Rao of Velpuri Village, Tanuku Mandalam, West Godavari District, A.P.,
That my client has acquired the below mentioned schedule property under a **Regd. dated 18-6-2018 Sale deed D.No. 4230/2018** excuted by **(1) Gunnam Varahalu,** W/o. late Gunnam Krishna Murthy, **(2) Gunnam Srinivasa Varaprasad,** S/o. late Gunnam Krishna Murthy, **(3) Gunnam Basavayya,** S/o. late Gunnam Krishna Murthy from the link document of 2526/1959, Actual document holder of 2526/1959 is Gunnam Krishna Murty, but he died on 08-12-1989. After the death of Gunnam Krishna Murthy, his family members excuted the sale of property to my client with out Death Certificate and family member certificate. Therefore this public notice is issued to all that anybody belongs to Gunnam Krishna Murthy family has any claims over schedule property, may shall comme forward with documentary proof with in 7 days from the date of this notice to the undersigned, else if shall be deemed that there are no claims or objections over the schedule property and the transaction will be proceeded with.
DOCUMENT SCHEDULE
West Godavari Dist., Bhimavaram District Registry, Tanuku Sub Registration Office, Tanuku Mandal, Velpur Village in R.S. No. 148/9 of site 147.68 sq.yards of following boundaries.
EAST: Canal Bund Road.
WEST: Site of Varre Bhargav Sree Siva Sai.
NORTH: Site of Varre Yugendar and Varre Surya Satyanarayana.
SOUTH: Site of Tummala Murali Krishna and others.
PAMMI V.NAGA VEERABHADRUDU
Advocate, Tadepalligudem, W.G.Dt.,
Cell: 7702311197

MUNICIPAL CORPORATION, ELURU
e-PROCUREMENT TENDER NOTICE No:
202-206/General & GGMP-Grant/2022-23, Dated. 06-3-2023
The Commissioner, Municipal Corporation, Eluru invites tenders from interested, eligible bidders for **"Providing CC Roads, Conversion of Existing Building into Ward Secretariat, Improvement to the Fire Station Center and Construction of Multipurpose Community Hall at various places in Municipal Corporation, Eluru"** Total No. of works is **5** with an amount of Rs. **35.37** Lakhs.
Tender schedules are available on e-procurement market place from 07-03-2023. Last date of receipt of tenders is 14-03-2023. Further details can be seen at e-procurement market place at www.apeprocurement.gov.in or contact Commissioner, Municipal Corporation, Eluru, Eluru District (Phone/ Fax: 08812-245990).
Sd/- **COMMISSIONER**
MUNICIPAL CORPORATION, ELURU